# వాజెమ్మ

"ఎందుకూ, నాక్కూడా మొగుడున్నాడని పేరేకానీ, పట్టీ అకర్మణ్యుడు! ఇటు పుల్లటు పెట్టడు. అన్నిటికీ నాకు చావొచ్చింది. అన్ని వ్యవహారాలూ నేనే చూసుకోవాలి. బయటి పనులూ, ఇంటిపనులతో నా ప్రాణం కడబట్టిపోతోంది. కనీసం బజారుకెళ్ళి కూరలు, సరుకులు కూడా తేడు. ఏం మనిషో!...

"పక్కింటి లక్ష్మణరావును చూసయినా నేర్చుకోవచ్చునే. పెళ్ళానికి అణుమాత్రం కష్టం కలిగించడతను. అన్నీ అమర్చిపెడతాడు. అతను బిజినెస్ చేసుకోవటంలా? మసలాగానా? ఎదురింటి గుర్నాథం గారి భార్య ఏం దర్జా వెలగబెడుతుంది! అతను గవర్నమెంటాఫీసరు. ఎంతమందో వస్తుంటారు. పోతుంటారు. కానుకలు సమర్పించుకుంటారు. ఆ పక్కింటి బ్యాంకు మేనేజరు పెళ్ళాం అలివేలుకేం పొగరు! 'డబ్బు డ్రా చేసుకోటానికి మీరే వస్తారట బ్యాంకుకి. మా వారు చెప్పారు' అంది. దాని ముఖంమండా, ఎవరొస్తే దానికెందుకో. నా ఒక్క మామిడితోటలో వచ్చే ఆదాయం లేదు. దాని మొగుడి సాలుసరి జీతం! ఎవర్నని ఏం లాభం, నా కర్మ ఇలా తగలడితే! పిల్లల చదువులెలా సాగుతున్నాయో నేనే చూసు కోవాలి. బ్యాంకుకెళ్ళి నేనే డబ్బు తెచ్చుకోవాలి. పాపం, ఆ దశరథరామయ్యా కున్నంత కనికరం కూడా లేదు మొగుడన్న వాడికి! 'అన్ని వ్యవహారాలూ నువ్వే చక్కబెట్టుకోవాల్సి వస్తోంది! చిన్నమ్మా! చిన్నయ్యగారు సాయంచేస్తే మీకింత ఇబ్బంది ఉండకపోను' అంటాడు. అతను చేసే పనులు అతను చేస్తూనే ఉన్నాడు. గుమస్తా కదా అని ఎన్ని పనులు అతనికప్పజెప్పటం! మనమేం పనిచెయ్యం. తినటం, పడుకోటం, రైలింజనులా గుప్పు గుప్పుమని సిగరెట్టు తాగుతూ పొగ వదలటం, లేకపోతే పుస్తకాలు చదువుకోటం. సాయంత్రం మొదలెడ్తే రాత్రి పదిగంటల దాకా పేకాట భాగవతమెలాగూ ఉంది. నా నుదుటన ఇలా రాసుంది. కిందటి జన్మలో ఏం పాపం చేసుకున్నానో, ఈ కొంపలో పడ్డాను. పిల్లలున్నారు కనుక ఈ కొంపను పడి వేళ్ళాడవల్సి వస్తున్నది. లేకపోతే ఈ మనిషిని వది లేసి వెళ్ళిపోయే దాన్ని. ఈ కొంపలో ఇల్లాలుగా ఉండటం కంటే మా అన్న ఇంట్లో దాసీగా ఉండటం మేలు.."

జానకి రబ్బుతోంది. భార్యకు బదులు పల్కటం దండగని వెంకట్రాజెప్పుడో నిర్ణయించుకున్నాడు. ఆమెతో మాటలు మానేసి చాలా కాలమైంది. తన ముఖం కనపడితే చాలు ఆమె పురాణం విప్పుతుంది. తను కనపడకపోతేగానీ ఆ ప్రవాహం ఆగదు. అందుకే నోరు కాలుతున్నా గబగబా కాఫీ తాగి, అతను ముందు గదిలోకెళ్ళి తలుపేసుకున్నాడు. అది అతని కోట. అందులోకెవరూ రారు, తన పేకాట మిత్రులు తప్ప.

మనసు వికలమైపోయింది వెంకట్రాజుకు. తన తల్లీతండ్రీ ఉన్నప్పుడు తను సుఖంగా గడిపిన జీవితం గుర్తుకు వచ్చింది అతనికి.

కథా నిలయం
4665

వెంకట్రాజు తల్లితండ్రులకు ఒక్కడే కొడుకు. లేకలేక కలిగాడు. అతన్ని ఎత్తైత్తు గారాబంగా పెంచారు అతని తల్లీతండ్రీ. చదువుల్లో అతనెప్పుడూ చురుకే. తెలుగు సాహిత్యంలో ఎం.ఎ. పట్టా పుచ్చుకున్నాడతను. పుస్తకాలంటే అతనికెంతో ఇష్టం. పుస్తకం పట్టుకుంటే అది పూర్తయిందాకా విడిచేవాడు కాదు. వాళ్ళది సంపన్న కుటుంబం. తాత ముత్తాతలు సంపాదించిన ఆస్తి ఉంది. తండ్రి కూడా ఆస్తిని పెంచాడు కానీ కరిగించలేదు. తల్లీతండ్రీ అతనికేపనీ చెప్పేవారు కారు. కొడుకేమన్నా కష్టపడిపోతాడేమోనని బెంగపడి పోయే వారు. అందుకే అతను సుఖంగా జీవనం గడపటానికి అలవాటుపడిపోయాడు.

గుంటూరులో ఎం.ఎ చదివే రోజుల్లో తన క్లాసుమేటు నవ్యను ప్రేమించాడు వెంకట్రాజు. నిజానికి అతను ప్రేమించబడ్డాడు. అతను అందగాడు. సన్నగా, పొడుగ్గా, నాజుగ్గా ఉండేవాడు. పచ్చటి ఛాయ, కోలముఖం, సన్నని మీసకట్టు. పొడవాటి ముక్కు ఊహల్లో తేలిపోయే కళ్ళు. నుదుటి మీదపడే వంకుల జుట్టు. ఎప్పుడూ తెల్లటి చొక్కాను మరింత తెల్లగా ఉండే ప్యాంటులో టక్‌చేసి కాలేజీకి వచ్చేవాడు. అతనికి ఎం.ఏ. మ్యాథ మెటిక్స్‌లో కూడా సీటు వచ్చింది. భావనాలోకంలో విహరించే వెంకట్రాజుకు ఆ సబ్జెక్ట్ డ్రైగా అన్పించింది. అందుకే తెలుగు సాహిత్యాన్ని తన అభిమాన విషయంగా ఎంచుకున్నాడు. తల్లిదండ్రులకు కొడుకు ఏం చదివినా అభ్యంతరం లేదు. అతను చదివి సంపాదించాల్సిన అవసరం లేదని వాళ్ళెప్పుడో నిర్ణయించుకున్నారు. అలా నాజుగ్గా, అందంగా ఉండే డబ్బున్న యువకుణ్ణి చూసి ఏ పిల్ల ప్రేమలో పడదు? నవ్య అందుకే అతన్ని ప్రేమించింది. ఆమె ప్రేమించింది కనుక అలా అని ఆమె చెప్పింది కనుక, శ్రమ లేకుండానే అతనూ ఆమె ప్రేమలో పడ్డాడు.

"నువ్వు ఒట్టి బుద్ధుడిలా ఉన్నావే? అమ్మాయి చెప్పాలా ముందుగా ప్రేమించానని! నువ్వు చెప్పాలి. అమ్మాయికి అబ్బాయి ప్రపోజ్ చేయటం రివాజు" అంది నవ్య.

"అబ్బ! ఎవరైతే నేంలే. తేడా ఏముంది? నువ్వు చెప్పేశావు ఓ పనయిపోయింది. నేను కాదనలేదుగా" అన్నాడు వెంకట్రాజు బద్ధకంగా.

"ప్రేమలో పడ్డవాళ్ళు అంత నీరసంగా మాట్లాడరు."

"ప్రేమ మృదువైంది, నాజూకైంది. ఆ మృదుత్వాన్ని నీరసంగా భావించకూడదు"

"ప్రేమలో ఆవేశం, ఉద్రేకం, ఎరుపుదనం ఉంటుంది. మృదువుగా, నీరసంగా ఉండదు".

అతనామె మాటలు అర్థం చేసుకోలేదు. ఎక్కువగా ఆలోచించి బుర్రబద్దలు కొట్టు కోవటం అతనికిష్టముండదు. అందుకే, అతనికి పుస్తకాలు చదవటమంటే ఇష్టం. పాఠకు డికి ఆలోచించే అవకాశం ఇవ్వకుండా రచయితే తన ఆలోచనలను పాఠకుడికి చెప్తాడు. రంజింపచేస్తాడు.

పుస్తకం చదివేశాక వెంకట్రాజు ఇంక ఆలోచించడు. అతనికి బద్ధకమేస్తుంది.

అతనామె మాటలకు జవాబివ్వలేదు. నవ్యే అన్నది. "మరీ బోరుగా వుంది రొటీను క్లాసులు. అలా ఎక్కడికైనా వెళ్ళి వద్దాం" అని.

"ఎక్కడికి?"

"నాగార్జునసాగర్ వెళ్ళి వద్దాం, ఒకటి రెండు రోజులు"

"మీ హాస్టల్లో ఇబ్బందేం లేదా?"

"మా ఇంటికెళ్తున్నా అని చెప్తాను."

"సాయంత్రానికి తిరిగి వద్దాం. పెళ్ళవకుండా రెండురోజులు బయట గడిపితే చూసిన వాళ్ళేమనుకుంటారు."

"ఎవరేమనుకున్నా నాకు లెక్కలేదు."

"అది సరే, ఓ యువకుడితో ఒంటరిగా రావటానికి నీకు భయం వేయదా!"

"భయమా?" అని నవ్వింది నవ్య. "ఆ భయమేదో నీకున్నట్టుంది."

"నాకు భయమెందుకూ? నేను మగాణ్ణి."

"అంటే సరిపోదు"

ఆమె కవ్వింపుకు అతనికి భయమేసింది. ఓ రెండు రోజులు ఆమెను తప్పించుకు తిరిగాడు. తరువాత ఆమె కలిసి అడిగినప్పుడు. "పరీక్షలు దగ్గరకొస్తున్నాయి. సీరియస్‌గా చదువుకోవాలి. ఇప్పుడు పిక్నిక్‌లు, టూర్లు అంటే కుదర్దు" అన్నాడు.

ఆమె అతని వంక విరసంగా చూసి, మారు మాట్లాడకుండా వెళ్ళిపోయింది.

నిజానికి వాళ్ళ ప్రేమకి పరీక్షా సమయమే వచ్చింది. పరీక్షలయి ఇంటికెళ్ళాక తల్లీ తండ్రీ అతని పెళ్ళి చేయాలని నిశ్చయించారు. పిల్ల జానకి అతని మేనమామ కూతురే. ఎప్పటినుండో అనుకున్న సంబంధమే.

తల్లి చెప్పింది. "మామయ్య తొందరపడుతున్నాడురా. పిల్లకు ఇరవై ఏళ్ళు వచ్చాయి. ఇంక మీ వాడెప్పుడు చేసుకుంటాడు అనడిగాడు" అని.

"నేను జానకిని చేసుకోనమ్మా" అన్నాడు వెంకట్రాజు.

"ఏం ఎందుకు చేసుకోవు?"

"గుంటూరులో నవ్య అని నాతో ఎం.ఎ. చదివింది. మేం ప్రేమించుకున్నాం. ఆమెనే చేసుకుంటాను."

"బావుందిరా నాయనా, ఈ ప్రేమలూ దోమలూ, ఎప్పటినుంచో అనుకున్న సంబంధం. మామయ్యే మనుకుంటాడు!"

"ఆ పిల్లది మన కులమేనా?" అడిగాడు తండ్రి.

"ఏమో తెలీదు."

"డబ్బున్న వాళ్ళేనా?"

"ఏమో తెలీదు."

"అన్నదమ్ములు, అక్కచెల్లెళ్ళు ఎంత మందో తెల్సా?"

"ఏమో తెలీదు."

"తల్లీ తండ్రీ ఉన్నారా. లేక గాల్లోనుంచి ఊడిపడ్డదా?"

"ఏమో తెలీదు" అని నాలిక్కరుచుకున్నాడు వెంకట్రాజు.

"మరేం తెల్సి ప్రేమించావురా. నీ ముఖం. ప్రేమాలేదు, దోమాలేదు. నోర్మూసుకో. నువ్వసలే మేధకుడివి. మేం ఉన్నంతకాలం ఫర్లేదు. మాకేదయినా అయితే నీకు అండ కావాలి. పిల్లనిచ్చుకున్న మామ కనుక మామయ్య, బావలూ నీకు అండగా ఉంటారు. జానకితో నీ పెళ్ళి ఖాయం. వచ్చే నెల్లోనే పెళ్ళి".

వెంకట్రాజు నసిగాడు కానీ, పెద్దగా అభ్యంతరం చెప్పలేదు. తండ్రి అన్న మాటకూడా అతనికి సబబే అన్పించింది. ఏపని చెయ్యాలన్నా తనకెవరయినా తోడుండాలని అన్పిస్తుంది. నిజానికి మామయ్య పెద్ద అండే. నవ్య కూడా మరీ ఫాస్ట్ గర్ల్‌లా ఉంది. ఆమెను చేసుకుంటే తాను ఆమె చెప్పినట్టు వినాల్సి వస్తుంది. పైగా ఆమె గురించి తనకేమీ తెలీదు. అప్పుడతనికి ఆమె ఫాస్ట్‌నెస్ మాత్రమే గుర్తుకొచ్చింది కాని, తాను ఆమెను ప్రేమించాడన్న సంగతి మర్చిపోయాడు.

వెంకట్రాజు, జానకిల పెళ్ళయింది. తను పెళ్ళి శుభలేఖ ఒకటి నవ్యకు పంపేసి ఊరుకున్నాడు వెంకట్రాజు. ఆమె పెళ్ళికి రాలేదు కానీ అతనికో ఉత్తరం రాసింది. తనను తిడ్తూ ఉత్తరం రాసి ఉంటుంది. మరింకేముంటుంది దాన్లో అనుకుని కవరు కూడా చింపకుండా తమ గదిలో టేబుల్ మీద పడేశాడతను. ఇప్పుడాగది భార్యది కూడా అనే సంగతి అతను మర్చిపోయాడు. జానకి కవరు చింపి ఉత్తరం చదివింది. "ఏమిటీమె ఇలా రాసింది?" అన్నదామె.

"ఏం రాసింది?" భార్యనడిగాడు వెంకట్రాజు.

"నీలాంటి వాజెమ్మను ప్రేమించటం నాదే బుద్ధితక్కువ" అని రాసింది.

"మనిషికి పొగరు. తను ప్రేమిస్తే నేను ప్రేమించాలా?"

జానకి మరేం మాట్లాడలేదు.

ఎం.ఎ. పరీక్ష రిజల్ట్స్ వచ్చాక అతను ఉద్యోగాలకు అప్లయి చేశాడు. ఎక్కడో చిత్తూరులో లెక్చరర్‌గా ఉద్యోగమొచ్చింది.

వెంకట్రాజు ఉద్యోగంలో చేరాలని ఉబలాటపడ్డాడు. కానీ అతని తల్లితండ్రులు పడనివ్వలేదు. "నీ ముఖం, అంతదూరం ఆ బడిపంతులు ఉద్యోగానికి వెళ్ళాలా? నీది అంతంత మాత్రపు ఆరోగ్యం. నువ్వక్కడ ఉంటే, నువ్వెలావున్నావో అని మా ప్రాణం కొట్టుకుపోతూ ఉంటుంది. మనకింత ఆస్తి ఉంది. దాన్ని చక్కగా నిర్వహించుకుంటే చాలు. నువ్వు ఉద్యోగాలు చేసి సంపాదించాల్సిన పనిలేదు" అన్నారు వాళ్ళు.

అతనికా మాట నచ్చింది. నిజమే కదా! ఊళ్ళో వ్యవసాయముంది. పొలం కౌలుకిచ్చినా, రైతులు మోసం చేయకుండా పంటచేతికొచ్చేట్టు చూసుకోవాలి. తాముండే

పట్నంలోనే అయిలు మిల్లు, రైసు మిల్లు ఉన్నాయి. వాటిని నడుపుకోవాలి. తండ్రి ఒక్కడి వల్లా కాదు. జానకికి కూడా చిత్తూరులాంటి దూర ప్రదేశంలో భర్త ఉద్యోగం చేయటం ఇష్టం లేదు. అందువల్ల అతను ఇంక ఉద్యోగ ప్రయత్నాలు చెయ్యటం మానేశాడు. అతను ఎవరితోనూ పేచీ పడేవాడు కాదు కనుక, తన ఇష్టమే జరగాలని మంకు పట్టు పట్టేవాడు కాదు గనక, తన మానానికి తన్ను వదిలేస్తే చాలనుకునేవాడు కనక అతనికి మొదట్లో భార్యతో ఇబ్బందేం కలగలేదు. డబ్బుకి ఇబ్బందిలేదు. ఆమెకు నగలు కావాలన్నా, చీరెలు కావాలన్నా అన్నీ ఆమెకు అత్తగారే సమకూర్చి పెట్టింది. చివరకు ఓ మూరెడు మల్లెపూల దండ కూడా తెచ్చేవాడు కాదు వెంకట్రాజు. పొలానికీ, మిల్లులకీ సంబంధించిన అన్ని వ్యవహారాలు, గుమాస్తా దశరథరామయ్య సాయంతో తండ్రే చూసుకునేవాడు. తండ్రి మిల్లుకెళ్తూ, ఎప్పుడైనా, “ఓసారి రారా, మిల్లుకెళ్దాం. విషయాలన్నీ నీకు బోధపడ్తాయి. నా తరవాత నీకు వాటి నిర్వహణ తెలుస్తుంది” అని అన్నా, “ఇప్పుడు కాదు నాన్నా. తరవాత వస్తాను” అని తప్పించుకునే వాడతను. జీవితంలో ప్రాక్టికల్ విషయాలంటే అతనికి బోరు. పుస్తకాలు చదువుతూ ఊహా లోకాల్లో విహరించటం అతనికిష్టం. జానకికి పొద్దస్తమానం ఇంట్లో కూర్చునే భర్తంటే విసుగు పుట్టేది.

“ఏదన్నా ఉద్యోగం చూసుకోరాదూ, వ్యాపకమన్నా ఏర్పడుతుంది” అంది ఓ సారి.

“ఒకడి కింద పనిచెయ్యాల్సిన ఖర్మ పట్టలేదు నాకు. బోల్డంత ఆస్తి ఉంది. అది చూసుకుంటే చాలు” అన్నాడతను.

“పోనీ, ఆ పనయినా చెయ్యొచ్చుగా. మామయ్య ఎంతకాలమని చేస్తారు?”

“చేద్దాం. తొందరేం”

“నీకేదీ తొందరలేదు”

“నీకేం? చెప్పటం తేలికే, చెయ్యటమే కష్టం”

“ఏం కష్టం? మా నాన్నను బయటి కెళ్ళనివ్వరు మా అన్నలు. బిజినెస్ పనంతా వాళ్ళే చూసుకుంటారు.”

“వాళ్ళకు చదువా సంధ్యా! ఎప్పుడూ డబ్బు యావ తప్ప జీవితం ఎంత సుఖంగా, అర్థవంతంగా గడపవచ్చో వాళ్ళకు తెలీదు”.

“అహాఁ! నీకు బాగా తెల్సు. నిర్వ్యాపారంగా ఇంట్లో కూర్చోడం తప్ప నువ్వు చేస్తున్న దేముంది?” అని విసురుగా వెళ్ళిపోయింది అతని భార్య.

తండ్రి పోయేటప్పటికే అతనికిద్దరు పిల్లలు కలిగారు. తండ్రిపోయినా వెంకట్రాజు ఆస్తి వ్యవహారాల్లో తలదూర్చలేదు. పట్టనట్టు ఉండిపోయాడు. దశరథరామయ్య సాయంతో జానకే ఆ పనులు నిర్వహించసాగింది. జీవితంలో మరింత భారం ఆమెపై పడింది కానీ వెంకట్రాజుకు కాలం గడపటం మరింత తేలికైంది. తండ్రి బతికున్నప్పుడు తనే బయటికెళ్ళి మిత్రులతో పేకాట ఆడి వచ్చేవాడు. తండ్రి పోయాక, తానే ఇంటికి యజమాని అయ్యాడు కనుక వాళ్ళనే ఇంటికి పిలిపించుకోసాగాడు. ఒకో రోజు సాయంత్రం మొదలైన పేకాట

కార్యక్రమం రాత్రి తెల్లవార్లూ కూడా సాగేది. ఇది చూసి ఓర్చుకోలేని జానకి ఓ రోజు భర్తతో తగాదా వేసుకున్నది.

"రేపటినుంచి మీ పేకాట బృందం ఇంటికొచ్చిందంటే ఊర్కోను. ఒక్కొక్కణ్ణీ తన్ని తగలేస్తాను" అంది.

"వాళ్ళు నిన్నేం చేశారు? మా మానాన మేం పేకాట ఆడుకుంటే నీకు కోప మెందుకూ?" అన్నాడు వెంకట్రాజు.

"బుద్ధి లేకపోతేసరి. పేకాటే జీవితమా?"

"ఆ మాట నేననను. సరదాగా కాసేపాడుకుంటున్నాం. తప్పేముంది?"

"ఆస్తి వ్యవహారాలు చూడటం, పిల్లల చదువులెలా సాగుతున్నాయో పట్టించుకోవల్సిన బాధ్యతలు లేవా?"

"వాటి వ్యవహారం నాకంటే నీకే బాగా తెల్సు. అందుకే నీకు వదిలేశాను. పైస పైస చూసుకుని ఖర్చు పెట్టే వంశంలో పుట్టలేదు నేను"

"అత్తమ్మ కడుపున చెడబుట్టావు."

"ముయ్యి నోరు. ఏ మాటనాలో, ఏ మాటనకూడదో కూడా తెలిసి చావదు."

"నువ్వు నాకు బుద్ధులు చెప్పనక్కర్లేదు. గురువిందగింజకు తన నలుపు తనకు తెలీదు."

ఇంటి పనులతో, బయటి పనులతో ఆమెకు విసుగేసేది. ఓసారి–

"ఇదుగో, ఎప్పుడూ అలా కొంపలో కూర్చోకపోతే మార్కెట్టు వెళ్ళి కూరలట్టుకు రారాదూ?" అనేది.

"నాకు పనులున్నాయి. నావల్లకాదు."

"ఏం పనులూ? పేకాట మిత్రులొస్తారా?"

"................"

"పిల్లల స్కూలు టీచరు నిన్ను రమ్మని కబురు చేసింది. ఓసారి వెళ్ళి పిల్లలెలా చదువుతున్నారో ఏమిటో విచారించి రారాదూ? వస్తూ, వస్తూ అలాగే మార్కెట్టులో నుంచి కూరలు కూడా తీసుకురావచ్చు"

"నీకేం పనిలేదటే.. నా ప్రాణాలు తీస్తావు. ఒక్క క్షణం ప్రశాంతంగా బతకనివ్వవు."

"క్షణమేం ఖర్మ. జీవితమంతా ప్రశాంతంగా గడపాలని నిర్ణయించుకున్నావు. నా ఖర్మ కాలి మానాయన నన్ను నీకు కట్టబెట్టాడు."

ఆమె అలా కొనసాగించేదే కానీ భర్త లేచి వెళ్ళిపోవటంతో మానివెయ్యాల్సి వచ్చింది. ఒకటి రెండేళ్ళ తేడాలో ఆమె తండ్రీ, మేనత్తా కూడా పోయారు. ఏ విషయంలో సలహా సంప్రతింపులు కావల్సివచ్చినా వాళ్ళ ఆసరా ఉండేది. వెంకట్రాజుకు చెప్పుకోవటం బండకు వెళ్ళి మొరపెట్టుకోవటమే అయేది. భార్యాభర్త ఎప్పుడు మాట్లాడటం మొదలు

పెట్టినా పోట్లాటతోనే అంతమయ్యేది. ఆమె పుట్టింటికి వెళ్తానని బెదిరించేది. అప్పుడు భయపడి పోయేవాడు వెంకట్రాజు. ఆమె వ్యవహారాలన్నీ చూసుకుంటున్నది కాబట్టే తన జీవితం సుఖంగా జరిగిపోతున్నదని అతనికి తెల్సు. అప్పుడు కాళ్ళ బేరానికి వచ్చేవాడు. బాగా గోలయినప్పుడు ఇరుగు పొరుగు వాళ్ళు కూడా సర్ది చెప్పసాగారు. వెంకట్రాజు ఇంక భార్యతో వాదనకు దిగటం మానేశాడు. భోజనానికి మాత్రం ఇంట్లోకి వెళ్ళేవాడు. తక్కిన సమయమంతా ముందు గదిలోనే గడపసాగాడు.

రోజూ ఉండే రాద్ధాంతమే కానీ అతనికి మూడ్ బాగా లేదు. క్రితం సాయంత్రం పేకాట మిత్రులు కూడా రాలేదు. వాళ్ళనేమన్నా అని భార్య రాకుండా చేసిందా అన్న అనుమానం కూడా వచ్చింది అతనికి. ఆ అనుమానం వచ్చాక అతనికి కసి కూడా పెరిగి పోయింది. హత్య చేద్దామన్నంత కోపం వచ్చింది కానీ, అందుకు ప్లాను వెయ్యటం బద్ధక మనిపించి ఆ ఆలోచన మానుకున్నాడతను. బట్టలేసుకుని బయటపడ్డాడు. ఊరుదాటి పంట కాలువ వంతెన మీద కూర్చున్నాడు. జీవితంలో మొదటిసారి కష్టమొచ్చినట్టు అన్పించింది అతనికి. బుద్ధికి మొదటిసారిగా పని కల్పించాడు. ఆలోచించగా ఆలోచించగా అతనికి వివేకానందుడు చెప్పినమాట గుర్తుకు వచ్చింది.

"సమస్యలు కోతుల్లాంటివి. మనం భయపడి పారిపోతున్నంతవరకూ అవి మనల్ని వెంటాడి వేధిస్తాయి. వాటికి ఎదురు తిరిగితే అవే తోక ముడిచి వెనక్కు తిరిగి పారిపోతాయి – అని చెప్పాడు వివేకానందుడు. భార్య పుట్టింటికి వెళ్తానని బెదిరిస్తున్నది. తనే కొంప వదిలేసి వెళ్తానని బెదిరిస్తే...? చచ్చినట్టు పడి ఉంటుంది. సమస్యకు పరిష్కారం దొరికింది అతనికి.

ఆలోచనల్లో పడిపోయిన అతనికి టైము పన్నెండు గంటలయిందని తెలియలేదు. కడుపులో ఎలుకలు పరుగెత్తటం మొదలెట్టాయి. అయినా సమస్యకు పరిష్కారం దొరక డంతో హుషారుగానే ఇంట్లోకి వెళ్ళాడు. జానకి భోజనం వడ్డిస్తుంటే తినసాగాడతను. తిండిలోకి ఏదీ సరిగాలేదు. భోజనం దగ్గర ఏది లోపించినా అతనికి కోపం వస్తుంది.

"ఏం పప్పు చేయలేదా? పచ్చళ్ళేసి పెడుతున్నావు" అనడిగాడతను భార్యను.

"వంటావిడ ఎగ్గొట్టిందివ్వాళ. పిల్లలు స్కూళ్లకెళ్ళి వచ్చేటప్పటికి పదకొండయింది. పన్నెండు దాటితే నువ్వుండలేవని కూర మాత్రం చేశాను. అందరూ నన్ను వేధించే వాళ్ళే! దానికిష్టమొచ్చినప్పుడు పని మానేస్తుంది. నావల్ల కావటంలేదు – బయటపనీ, ఇంటిపనీ చేయటం. మా పుట్టింటికి వెళ్ళిపోతాను. మా పెద్దన్నయ్య రమ్మని రాస్తున్నాడు ఎప్పటి నుండో. పిల్లల్ని కూడా వదిలేసి వెళ్తాను. అప్పుడు కానీ నా విలువ తెల్సిరాదు నీకు.."

ఆమె నోటికింక అదుపుండదని అతనికి తెల్సు. తన ఆలోచన ప్రయోగించటానికి తరుణం ఆసన్నమయిందని అతనికి తెల్సిపోయింది. కోపాన్ని ప్రదర్శిస్తూ కంచంలో చెయ్యి కడుక్కుని లేచాడతను. "ఈ జన్మకిక నాకు మనశ్శాంతి లేదు. నువ్వు కొంప వదిలేసి వెళ్ళటమెందుకూ? నేనే వెళ్తున్నాను. ఇహ మీ చావు మీరు చావండి..." అంటూ విసురుగా తన గదిలోకెళ్ళిపోయాడు.

భార్య బతిమాలుతుందేమోనని ఓ క్షణం చూశాడు. ఆమె రాలేదు. ఆమెకు పరిస్థితి ఆకళింపు చేసుకోటానికి సమయమివ్వాలని మెల్లగా బట్టలు వేసుకున్నాడు. 'మన సంగతేమిలో దానికి తెలియాలి. ఇంటిని వదిలి బయలుదేరాలని అనుకుంటోంది. మనం ఎదుర్కొంటే తోకముడిచి పారిపోవాలి' అనుకున్నాడు. చెప్పులు వేసుకున్నాడు. కానీ, భార్య అలికిడి లేదు. హాల్లోకి వస్తూ "ఇక నీ చావు నువ్వు చావు. ఈ కొంపలోకి మళ్ళీ అడిగిద్దే ఒట్టే. చదువులేనిదాన్ని చేసుకుంటే మరేమవుతుంది! ఎప్పుడూ డబ్బు ధ్యాస తప్ప మరేం ఉండదు. హాయిగా బతకటమెలాగో చెప్పి ఏం ప్రయోజనం? ఇన్నేళ్ళుగా చెప్పి చూశాను. వినలేదు. ఇంక మన దారులు వేరయిపోతున్నాయి. నేను వెళ్ళాక గానీ నీకు నా విలువ తెలిసిరాదు" అని వీధి వాకిలివైపు అడుగేశాడు.

తన ప్రయోగం విజయవంతమవుతుందన్న నమ్మకం, శత్రువు అహంకారం అణి చేస్తుందన్న విశ్వాసం అతనికుంది. అయితే, తను వెళ్తూంటే భార్య విభ్రాంతితో నిలబడి పోయిన జాడ కూడా అతనికి కలగలేదు. అప్పుడింక అతనికి నిజంగానే కోపం వచ్చింది. వీధి వాకిలి దాటాడు. వీధిలోకడుగెట్టాడు. నడుస్తూ అనుకున్నాడు. 'ఇప్పుడు బుద్ధి వచ్చి వుంటుంది దానికి. గుండెలు బాదుకుని ఏడుస్తూ ఉంటుంది. కాసేపు ఏడవనీ. అప్పుడు కానీ తిక్క కుదరదు' అని ఓ ఫర్లాంగు దూరం వెళ్ళి వెనక్కి తిరిగి చూశాడు. ఇంటి గుమ్మం దగ్గర జానకి జాడ కన్పించలేదు. అయినా ఆశ కోల్పోలేదతను. భార్య పశ్చాత్తాపంతో అనే మాటలు ఊహించుకోసాగాడు. 'ఇంకెప్పుడూ నిన్ను సాధించను. నువ్వు నా ఇంటి ఇలవేల్పు. నన్ను క్షమించు' అంటుంది. 'అప్పుడు వెళ్దాం ఇంటికి' అనుకున్నాడతను. ఆ వీధి పెద్దబజారులో కలుస్తుంది. ఆ మూల తిరుగుడులో ఓ పరిచయస్థుడయిన ఒకాయన కొట్టు కన్పించింది. ఆ కొట్టులోకి వెళ్ళి కూర్చున్నాడతను. "రా, రా, చిన్నబాబూ! తమరు కన్పించటమే లేదు ఈ మధ్య" అని ఆహ్వానించాడతను.

"ఏదీ కుదిరి చావటంలేదు. పనులు" అన్నాడు వెంకట్రాజు.

"కాదూ మరి! పెద్దయ్య పోయాక అంతా తమరే చూసుకోవాల్సి వస్తోంది కదా!"

ఆ షాపులో కూర్చుని ఓ గంట పిచ్చాపాటీ మాట్లాడసాగాడు. కానీ అతని మనసు మనసులో లేదు. 'తన కోసం మనుషుల్ని పంపించి ఉంటుంది. వాళ్ళు తన్ను వెదుకుతుంటారు' అనుకున్నాడు. క్షణాలు గడచి గంటయింది. తనావిడని మన్నించమని అడగటానికెవడూ రాలేదు. మరోగంట గడిచింది. కాలం గడుస్తున్న కొద్దీ అతనిలో టెన్షన్ పెరిగిపోసాగింది. తన ప్రయోగం మిస్ ఫైరయింది అన్న అనుమానం కలగసాగింది. అంతలో అటుగాపోతున్న దశరథరామయ్య కన్పించాడు. అతన్ని పిల్చి అడిగారు. " ఇంటి కెళ్తున్నావా?" అని.

"అవును చినబాబూ! మీరిక్కడేం చేస్తున్నారు?" అన్నాడతను.

"పని మీద వచ్చాలే. మా అవిడ కంగారు పడుతుందేమో. నేనిక్కడున్నానని చెప్పు" అన్నాడు వెంకట్రాజు.

దశరథరామయ్య తలూపి వెళ్ళిపోయాడు. షాపులో కూర్చుని కూర్చుని విసుగు పుట్టింది అతనికి. దశరథరామయ్య ఇంటికెళ్ళి అరగంట దాటిపోయింది. సిగరెట్లు తాగుతూ అతనికి పిచ్చెత్తిపోయింది. ఆ సమయంలో అతని భార్య, దశరథరామయ్య వస్తూ కన్పించారు. సక్సెస్. కోతి తోక ముడిచి పరుగెత్తుకొస్తోంది అనుకున్నాడతను. వాళ్ళు దగ్గరగా వచ్చారు. దశరథరామయ్య తన్ను ఆమెకు చూపినట్లనిపించింది అతనికి. ఆమె కూడా తనవంక చూసినట్లనిపించింది. తన్ను చూసి ఆమె ముఖం సేదతీరి నట్లనిపించింది. అతను మొహం పక్కకు తిప్పుకున్నాడు. 'దాన్దుంపతెగ. ఎంతకీరాదేం?' అనుకుంటూ అవతలకి చూసిన వెంకట్రాజుకు తన భార్య, గుమస్తా పక్కవీధికి తిరగటం కన్పించింది. ఆ వీధిలోనే తమ ఆయిలు మిల్లు ఉంది. 'అక్కడికి వెళ్ళి ఉంటారు' అనుకున్న అతని గుండె నీరసించిపోయింది.

ఇంక కొట్టులో కూర్చోడం బాగనిపించలేదు. మధ్యాహ్నం భోజనం కూడా సరిగా చేయలేదు. కడుపులో ఆకలి కరకరలాడుతున్నది. తమ ఆయిలు మిల్లు ఉన్న వీధిలోనే ఓ హోటలుకు వెళ్ళి దోసెకు ఆర్డరిచ్చి భార్య తిరిగి వస్తుందేమోనని వీధివంక చూస్తూ కూర్చు న్నాడు. దోసె వచ్చింది. తిన్నాడు. కాఫీ తాగాడు. కానీ, భార్య అంతులేదు. ఓ గంట అలాగే కూర్చున్నాడు. 'తన్ను ఆ షాపులో జానకి చూడలేదేమో. దశరథరామయ్య చెప్ప లేదేమో' అన్న అనుమానం వచ్చింది అతనికి. అప్పుడు జానకి అటుగా రావటం కన్పించింది వెంకట్రాజుకు. 'బహుశా కొట్టు వేపు వెళ్తుందేమో. తానిక్కడున్న విషయం తెలీదుగా' దానికి అనుకుంటూ వీధిలోకి పరుగెత్తుకొచ్చి – "ఇదిగో నేనిక్కడున్నా" అని అరిచాడతను. ఆమె అతనివైపు కూడా తిరగకుండా వెళ్ళిపోయింది. అలా భార్య తన పట్ల అంత నిర్లక్ష్యంగా ప్రవర్తించగలదని అతను కలలో కూడా ఊహించలేదు. పరాజయ భావన అతన్ని కుదిపేసింది. 'రాత్రికెక్కడ భోజనం చెయ్యాలి? తనకు హోటలు భోజనం పడదు. ఆరోగ్యం చెడిపోతుంది. రాత్రికెక్కడుండాలి?' జీవితం మొదటిసారిగా సమస్యల వలయంగా కన్పించింది అతనికి. 'భార్య సాధిస్తేనేం. ఇంట్లో ఉన్నంత సుఖం మరెక్కడ ఉంటుంది' అన్న భావన కలిగింది. 'అయినా, దాని అధికారమేంటి? అది తన ఇల్లు. తన ఆస్తి. తన ఇంటికి వెళ్తే రావద్దంటుందా? చూద్దాం అదీ' అనుకున్నాడతను. ఇంటిదారి పట్టాడు. ఇంట్లోకడుగిడుతుంటే అతనికి ముందున్న ధైర్యం జారిపోయింది. కాళ్ళు వణికాయి. తను రావటం చూస్తున్న భార్యతో అతను "నా ఇల్లు, నా ఇష్టం" అన్నాడు.

"ఇంట్లోనేకాదు. బయటా పనికిరాని వాజెమ్మలకు సిగ్గూ ఎగ్గూ ఏముంటుంది!" అన్నదామె ఎటోచూస్తూ.

అతను జవాబివ్వలేదు. తన గదిలోకెళ్ళి మంచం మీద పడుకున్నాడు. 'సిగ్గులేని ఆడవాళ్ళు ఏమనుకుంటేనేం? ఇంటికంటే పదిలం మరోటి లేదు' అనుకున్నాడతను, తృప్తిగా సిగరెట్టు పొగ పీల్చి వదుల్తూ.

'ఈనాడు' ఆదివారం, 16 సెప్టెంబరు 2001